
సాక్షి నంద్యాల

మంగళవారం : 11 : జూలై : 2023



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథం పై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



కేసీకి నీరు విడుదల

గూడూరు: కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు సుంకేసుల డ్యాం నుంచి సోమవారం కేసీ కెనాల్‌కు 189 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



చిన్నకుటుంబానికి జైకొడదాం!

కుటుంబం లాగానే ఆయా దేశాల అభివృద్ధికి జనాభా పెరుగుదల పెద్ద అవరోధమవుతుంది. అందుకే పరిమిత కుటుంబాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పాలకులు చెబుతుంటారు. 8లో ▸

న్యూస్‌రీల్

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే



పట్టా రద్దు చేసినట్లు పత్రాన్ని సుబ్బన్నకు అందిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే అని ఆర్డీఓ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తండ్రి స్వార్జిత ఆస్తిని కుమారులు, కుమార్తెలు పంచుకుని ఆ తర్వాత తల్లిదండ్రులను ఆదరించకపోవడంతో అధికారులను ఆశ్రయించిన తండ్రికి న్యాయం జరిగింది. తండ్రి అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని కుమారులకు రిజిస్టర్ చేసిన పొలం పట్టాను సోమవారం ఆర్డీఓ రద్దు చేశారు. బనగానపల్లె మండలం అప్పలాపురం గ్రామానికి చెందిన జంబుల సుబ్బన్నకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 80 ఏళ్ల వయస్సు ఉన్న సుబ్బన్న దంపతులను కుమారులు సరిగా చూసుకోక పోవడంతో కూతుళ్లను నమ్మి వారి పేరున అతనికి ఉన్న ఎకరా పొలం రిజిస్టర్ చేయించారు. అయితే వారు కూడా సరిగా చూసుకోక పోవడంతో సుబ్బన్న ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేసి పొలాన్ని రిజిస్టర్ చేసుకున్న వారికి రద్దు చేస్తూ సుబ్బన్నకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

స్పందనకు 125 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాలటౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 125 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులకు చట్ట పరిధిలో చట్ట పరంగా తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, సీఐ దస్తగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌యూలో జాబ్ మేళా

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వీసీ ఎ.ఆనంద్‌రావు తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళాలో ఎంపికై విద్యార్థులకు ఏడాదికి రూ.1.68 లక్షల నుంచి రూ.3.4 లక్షల వరకు ప్యాకేజీ ఉంటుందన్నారు. ఏఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, 24//7 ఆల్, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌డీబీ ఫైనాన్స్, టెలిపెర్ఫార్మెన్స్ కంపెనీలు జాబ్ మేళాకు హాజరవుతున్నాయన్నారు.

15తో ముగియనున్న గడువు

కర్నూలు సిటీ: ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 15వ తేదీతో గడువు ముగియనుంది. పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు ఇటీవలే రావడంతో రెండో విడత అడ్మిషన్స్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న అడ్మిషన్స్ ప్రక్రియ చాలా మందకొడిగా జరుగుతుంది. ఇప్పటి వరకు 13 వేల మంది మాత్రమే అడ్మిషన్స్ ఆన్‌లైన్‌లో చేసుకున్నట్లు ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి తెలిపారు.

చిన్నోడు చిరుతే!

గతనెల 22న తిరుమలలో బాలుడిపై చిరుత దాడి

- రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన ఘటన
- ఏడుకొండల స్వామి దయతో పునర్జన్మ
- టీటీడీ సత్వర చర్యలతో మెరుగైన వైద్యం
- కనులారా వెంకన్న స్వామి ప్రత్యేక దర్శనం
- సోమవారం స్వస్థలం ఆదోనికి చేరిన కుటుంబం
- కృతజ్ఞతలు తెలిపిన బాలుడి తల్లిదండ్రులు



చిరుత దాడిలో గాయపడిన చిన్నారి (ఫైల్)

చిరుత నోట్లో చిక్కుకొని ఏడుకొండల స్వామి దయతో ప్రాణాలతో బయటపడిన చిన్నారి 18 రోజుల అనంతరం తిరిగి సొంత ఊరికి చేరుకున్నాడు. తిరుమలలో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన బాలుడిపై చిరుత దాడి ఘటన ఇప్పటికీ తలుచుకుంటే ఒళ్లు జలదరిస్తుంది. కళ్లెదుటే పిల్లాడి గొంతు కరుచుకొని క్షణాల్లో ఓ చిరుత అడవిలోకి ఈడ్చుకెళ్లడం కుటుంబ సభ్యులతో పాటు అక్కడున్న భక్తులను భయకంపితులను చేసింది. దేవుని దయ వల్ల బాలుడు మృత్యుంజయుడిగా సోమవారం ఆదోనిలోని తమ ఇంటికి చేరుకోగా స్థానికుల్లో సంతోషం వ్యక్తమైంది. ఆ వివరాలు చిన్నారి తల్లిదండ్రులు శిరీష, కొండానాయక్‌ల మాటల్లోనే..



ఇంటి వద్ద సైకిల్‌తో ఆడుకుంటున్న కౌశిక్‌నాయక్

ఆదోని అర్బన్: ''పట్టణంలోని రాజరాజేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్నాం. చక్కీల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న మాకు ఇద్దరు కుమారులు(ప్రేమ్‌నాయక్, కౌశిక్ నాయక్) సంతానం. గత జూన్ 22న ఉదయం 7 గంటలకు ఆదోని నుంచి రైలులో తిరుపతికి బయలుదేరాం. మధ్యాహ్నానికి అక్కడికి చేరుకోగా.. సాయంత్రం అలిపిరి మెట్ల మార్గంలో కాలినడకన తిరుమలకు పయనమయ్యాం. మాతో పాటు తాత తిమ్మయ్య, అత్త సుజాత ఉన్నారు. మూడేళ్ల కౌశిక్ తన తాతతో పాటు ముందు వెళ్తున్నాడు. ఆ సమయంలో హఠాత్తుగా ఓ చిరుత మీదకు దూకి బాలుడిని గొంత వద్ద పట్టుకొని అడవిలోకి ఈడ్చుకెళ్లింది. ఒక్కసారిగా ఏం జరిగిందో అర్థం కాలేదు. వెంటనే అందరం దాని వెంటపడ్డాం, మాతో పాటు టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది అరుపులు, కేకలు వేస్తూ అడవిలోకి పరుగు తీశాం.

కారు చీకట్లో రోదిస్తూ ఎదురొచ్చాడు..

పెద్ద ఎత్తున అరుపులు, కేకలతో భయాందోళనకు లోనైన చిరుత బాలుడిని వదిలి పరారైంది. కారు చీకట్లో ఎక్కడెక్కడో వెతికాం. ఎత్తుకెళ్లి అరగంట గడిచినా ఆచూకీ లభించకపోవడంతో ఇక దక్కడనే అనుకున్నాం. ఆ సమయంలో పిల్లాడి ఏడుపు వినిపించడంతో ఆ దిశగా వెళ్లాం. రాళ్లు రప్పలను దాటుకుంటూ చెట్ల మధ్య నుంచి ఏడ్చుకుంటూ వస్తున్న మా కుమారుడిని చూడగానే ప్రాణం లేచి వచ్చింది. ఏడుకొండల స్వామిని మనసులోనే తలుచుకొని పిల్లాడిని హత్తుకున్నాం. రక్తగాయాలను చూసి గుండె ఆగినంత పనైంది. ఏమైందో ఏమోనని కంగారుపడ్డాం. టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే 108లో తిరుపతిలోని పద్మావతి చిల్డ్రన్స్ ఆసుపత్రికి తరలించారు.



చిరుతను బంధించిన దృశ్యం

ఆస్పత్రిలో బాగా చూసుకున్నారు..

తిరుపతి పద్మావతి చిల్డ్రన్స్ ఆస్పత్రిలో మా కుమారునితో పాటు మాకందరికీ ఏ లోటు లేకుండా చూసుకున్నారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ఇతర అధికారులు అందరూ అప్పటికప్పుడు స్పందించారు. ఆసుపత్రిలో కూడా ఎంతో ధైర్యం చెప్పారు. పిల్లానికి ఏమీ కాదని, ప్రాణహాని లేదని చెబుతూనే మెరుగైన వైద్యం అందించారు. 18 రోజుల చికిత్స అనంతరం గత శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మా పిల్లాడిని మాకు పూర్తి ఆరోగ్యంతో అప్పగించారు. ఆ దేవునితో పాటు అధికారులందరికీ రుణపడి ఉంటాం.



చిరుతపులి దాడి ఆనవాళ్లు



తల్లిదండ్రులు శిరీష, కొండాలతో బాలుడు కౌశిక్‌నాయక్

ఉచితంగానే దర్శనం

డిశ్చార్జి అయిన వెంటనే పిల్లాడితో పాటు మమ్మల్ని ప్రత్యేక వాహనంలో తిరుమలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా రూములు కేటాయించి స్వామి వారి బ్రేక్ దర్శనభాగ్యం కల్పించారు. అరగంటలోపు దర్శనం పూర్తి కాగా.. లడ్డూలను కూడా అందించారు. మా జీవితంలో ఈ దర్శనం మర్చిపోలేని అనుభూతి. ఆ తర్వాత తిరుమల నుంచి ప్రత్యేక వాహనంలో ఆదివారం మధ్యాహ్నం తిరుపతి రైల్వేస్టేషన్‌లో వదిలారు. సోమవారం ఇంటికి చేరుకున్నాం. బాబుకు పునర్జన్మ లభించిందంటే అంతా స్వామి దయ.

స్థానిక సంస్థలకు నిధులు విడుదల

- జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు రూ.87.14 లక్షలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు ప్రభుత్వం వివిధ రకాల గ్రాంట్లను విడుదల చేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు సంబంధించి 2011 జనాభా లెక్కల ప్రకారం పర్‌క్యాప్టా కింద రూ.28,89,920, సీనరేజ్ గ్రాంట్ రూ.1,13,67,920, జెడ్పీ చైర్మన్‌తో పాటు 52 మంది జెడ్పీటీసీలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత గౌరవ వేతనాలకు రూ.5,92,159 విడుదలయ్యాయన్నారు. అలాగే జిల్లాలోని 53 మండలాలకు పర్‌క్యాప్టా కింద రూ.44,27,056, సీనరేజ్ గ్రాంట్ కింద రూ.1,05,34,606, ఎంపీపీలు 53 మంది, 807 మంది ఎంపీటీసీలకు గౌరవ వేతనంగా రూ.81,22,662 విడుదలైనట్లు సీఈఓ తెలిపారు. కాగా జెడ్పీటీసీ, ఎంపీపీలకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు గౌరవ వేతనంగా రూ.6 వేలు, ఎంపీటీసీలకు నెలకు రూ.3 వేలు, జెడ్పీ చైర్మన్‌కు నెలకు రూ.40వేలను గౌరవ వేతనంగా అందిస్తోంది.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ వారు డిప్లమా పారామెడికల్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిట్టూరి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఏదైనా గ్రూపు పాసైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. 10 డిప్లమా పారామెడికల్ కోర్సులు, డిప్లమా ఇన్ అనెస్థీషియా, ఎంఎల్‌టీ, రేడియాలజీ, డీఎంఎస్‌టీ, కార్డియాలజీ, క్యాథలాబ్, డయాలసిస్, పెర్ఫ్యూజన్, రెస్పిరేటరి థెరపీ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కన్వీనర్ కోటా సీట్లకు ఈ నెల 24వరకు, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు వచ్చే నెల 24వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. కన్వీనర్ సీట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తిస్తుందని తెలిపారు. వివరాలకు కర్నూలు జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్‌లోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో లేదా 7995013422, 7337362530 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పల్లెకు ఆర్థిక పుష్టి

- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.59.01 కోట్లు విడుదల

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీలు ఆర్థికంగా నిలుదొక్కుకోనున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మొత్తం 893 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు టైడ్, బేసిక్ గ్రాంట్లు కలిపి మొత్తం రూ.59,01,12,885 విడుదలయ్యాయి. ఇందులో బకాయి పడిన, ప్రస్తుతం చెల్లించాల్సిన విద్యుత్ చార్జీలకు సంబంధించి రూ.28,85,33,972ను ప్రభుత్వమే ఏపీఎస్‌పీడీసీఎల్, ఈఈఎస్‌ఎల్ కంపెనీలకు సర్దుబాటు చేసింది. మిగిలిన రూ.30,15,78,913ను పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగు నీటికి సంబంధించిన పనులను ప్రాధాన్యతగా చేపట్టవచ్చు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల పనులు కూడా చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయి.

కర్నూలు జిల్లాకు..

కర్నూలు జిల్లాలోని 484 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.31,24,52,342 విడుదల కాగా, ఇందులో ఏపీఎస్‌పీడీసీఎల్‌కు రూ.10,22,10,463, ఈఈఎస్‌ఎల్‌కు రూ.4,28,23,318లను సర్దుబాటు చేశారు. మిగిలిన రూ.16,74,18,561లను గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి.



80 బన్నూరు సచివాలయం

నంద్యాల జిల్లాకు ...

నంద్యాల జిల్లాలోని 489 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.27,76,60,543 విడుదల కాగా, ఇందులో ఏపీఎస్‌పీడీసీఎల్‌కు రూ.10,27,96,622, ఈఈఎస్‌ఎల్‌కు రూ.4,07,03,569లను సర్దుబాటు చేశారు. మిగిలిన రూ.13,41,60,352ను ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేశారు.

పల్లెల్లో రూ.30.15 కోట్లతో అభివృద్ధి పనులు



గ్రామ పంచాయతీల్లో బకాయి పడిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం సర్దుబాటు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మొత్తం 893 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30.15 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రధానంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధుల్లో రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతారు.

– టి. నాగరాజునాయుడు, డీపీఓ

అభివృద్ధి పనులకు అవకాశం



2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులు విడుదల కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ నిధులతో గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతోంది. వీధుల్లోని చిన్న చిన్న సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతాం. టైడ్ గ్రాంట్ కింద రూ.7,48,555, బేసిక్ గ్రాంట్ కింద రూ.91,914 విడుదలయ్యాయి.

– మూలింటి రాధమ్మ, సర్పంచ్, ఆస్పరి

25 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో 9 మండలాలు, నంద్యాల జిల్లాలో 16 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో సగటున 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక్కడ జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ కాగా.. 10 రోజుల్లో 16.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇక నంద్యాల జిల్లాలో సగటున 2.4 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో జూలై నెల సాధారణ వర్షపాతం 141.2 మి.మీ కాగా.. మొదటి 10 రోజుల్లో 38.9 మి.మీ వర్షపాతం నమోదైంది.

ప్రాంతం	వర్షపాతం(మి.మీ)
పెద్దకడబూరు	13.4
మిడుతూరు	12.4
గడివేముల	12.4
సి.బెళగల్	10.2
ఆదోని	9.8
రుద్రవరం	7.4
సంజామల	6.2
మద్దికెర	5.8

కోనేరుల మరమ్మతులు షురూ

మహానంది: మహానంది అంటేనే అందరికీ గుర్తొచ్చేది తరగని స్వచ్ఛమైన గంగాజలంతో ప్రవహిస్తున్న కోనేరులు. అందులో రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరులు ప్రసిద్ధి. స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరుడి చెంత నుంచి నిత్యం గంగమ్మ ప్రవహిస్తుంటుంది. ఎంతో చారిత్రాత్మకమైన కోనేరుల మరమ్మతుల ఆధునికీకరణకు దేవదాయశాఖ రూ.80 లక్షలు మంజూరు చేసింది. అందులో భాగంగా ముందుగా ఆలయ ముఖమండపం ముందు ఉన్న రెండు కోనేరులలో భాగంగా ఎడమవైపు కోనేరు మరమ్మతుల పనులు ప్రారంభించారు. లోపల ఉన్న రుద్రగుండం కోనేరులో నుంచి బయట ఉన్న రెండు కోనేరులకు రెండు ఉపకాల్వల ద్వారా నిత్యం నీరు వస్తుంటుంది.



చిన్నకోనేరులో పనులు ప్రారంభించిన దృశ్యం

ప్రస్తుతం మరమ్మతులు చేపట్టాలంటే ఆ నీటిని బయటికి పంపించి కోనేరులో నీరు లేకుండా చేయాలి. దీంతో కాంట్రాక్టర్లు అధిక సంఖ్యలో మోటార్లు వినియోగించి నీటిని వేరే మార్గంలో బయటికి పంపిస్తున్నప్పటికీ గంగమ్మ ఊరుతూనే ఉంది. దీంతో ప్రత్యేక చర్యలు తీసుకుని పనులు ప్రారంభించారు.

వలంటీర్ల ఆగ్రహజ్వాల

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- కరోనా సమయంలో ఎక్కడ దాక్కున్నావు
- నోరు అదుపులో పెట్టుకోకపోతే బుద్ధి చెబుతాం
- నిష్పక్షపాతంగా సేవ చేస్తుంటే ఆరోపణలు తగవు
- బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్ల డిమాండ్



ఆళ్లగడ్డలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

నంద్యాల: 'జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి.. నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న మాపై కారుకూతలు కూస్తే సహించేది లేదు. కరోనా కష్టకాలంలో కూడా ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజల మధ్యనే ఉండి సేవలు అందించాం. ఇవన్నీ మరచిపోతే ఎలా? సినిమా డైలాగులు చెబితే ప్రజలు నమ్మరు' అని వలంటీర్లు పవన్ కల్యాణపై మండిపడ్డారు. ఈ నెల 9వ తేదీ రాత్రి ఏలూరులో జరిగిన సభలో పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల సోమవారం జిల్లా వ్యాప్తంగా గ్రామ/ వార్డు వలంటీర్లు భగ్గుమన్నారు. పలు ప్రాంతాల్లో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లోని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా పవన్ కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ పట్టణంలో రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. వలంటీర్లకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బనగానపల్లెలో..

బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ వరకు వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్లు ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని ఆ సమాచారాన్ని సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారని తమపై నిందలు వేయడం సరికాదన్నారు. సినిమా డైలాగుల మాదిరి ఎవరో స్క్రిప్ట్ రాస్తే చదవటం కాదని, ప్రజల్లోకి వచ్చి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, లేకపోతే రానున్న రోజుల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



నంద్యాల పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు



బనగానపల్లెలోని పెట్రోల్‌బంకు సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

ఆళ్లగడ్డలో..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో శిరివెళ్ల, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వలంటీర్లు సోమవారం పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శిరివెళ్ల మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి మద్దతు తెలిపారు. అలాగే ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, దొర్నిపాడులో వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల కన్వీనర్ జాఫర్, కరీం మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని, పవన్ కల్యాణ్ వాటిని గుర్తించకుండా నోటికి ఏది వస్తే అది మాట్లాడితే వలంటీర్లు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

డోన్‌లో..

పట్టణంలోని 16వ వార్డు సచివాలయం వద్ద వలంటీర్లు పవన్ కల్యాణ్‌కు వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల కన్వీనర్ రంగస్వామి మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌కు ప్రజల సమస్యలను సినిమా సమస్యలుగా చూస్తున్నారని, నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ముందు అది తగ్గించుకోవాలన్నారు. లేకపోతే భవిష్యత్తు రాజకీయం ఉండదన్నారు. మహిళల అదృశ్యానికి వలంటీర్లు కారణమని చెప్పడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు.

వార్డు మెంబర్‌గా గెలిచి వలంటీర్ల సేవలు తెలుసుకో



జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుగా వార్డు మెంబర్‌గా గెలిచి వలంటీర్ల సేవలు తెలుసుకుని మాట్లాడాలి. వలంటీర్ల మీద ఆరోపణలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం. సినిమా డైలాగులతో ప్రజా ఆదరణ పొందలేరు. వెంటనే ఆయన ఈ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని ప్రతి ఒక్క వలంటీర్‌కు క్షమాపణలు చెప్పాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– హరిణి, 21వ వార్డు వలంటీర్, నూనెపల్లె, నంద్యాల

ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నామనే విమర్శలు



ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి సంక్షేమ పథకాలను ఇంటికికీ చేర్చుతున్నాం. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించాం. దేశంలోనే వలంటీర్ల వ్యవస్థకు ఎంతో గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నామనే మాపై పవన్ కల్యాణ్‌పై దారుణంగా ఆరోపణలు చేశారు. పార్టీ అధ్యక్షుడిగా వలంటర్లీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. – వహీద్ నాయక్, 5వ వార్డు, నంద్యాల

క్లుప్తంగా

డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాగశివలీల

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వైఎస్‌ఆర్ క్రాంతి పథం(డీఆర్‌డీఏ-వైకేపీ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎం.నాగశివలీల సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య మాతృ శాఖ అయిన సహకార శాఖకు వెళ్లడంతో ఈ నెల 2న రిలీవ్ అయ్యారు. జిల్లా కలెక్టర్ సృజన హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.నాగశివలీలకు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్‌లో ఎంపీడీఓగా ఉన్న నాగశివలీల డిప్యుటేషన్‌పై ఏడు నెలలుగా మెప్మా పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా డీఆర్‌డీఏ-వైకేపీ బాధ్యతలు కూడా స్వీకరించారు.

తిరుమలనగర్‌లో చోరీ

- 12 తులాల బంగారం, మూడున్నర కేజీల వెండి అపహరణ

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని తిరుమలనగర్‌లో చోరీ జరిగింది. 12 తులాల బంగారం, మూడున్నర కేజీల వెండి, రూ.1.20 లక్షలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. బాధితుడు శ్రీకాంత్‌వర్మ బంగారు పనిచేస్తాడు. ఈయన గత శనివారం ఇంటికి తాళం వేసి మల్లికార్జున స్వామి దర్శనం కోసం శ్రీశైలానికి వెళ్లాడు. ఆదివారం ఇంటి పక్కన ఉన్న వారు ఫోన్‌చేసి ఇంటి తాళం పగలగొట్టిన విషయం చెప్పారు. అదేరోజు రాత్రి ఆయన ఇంటికి తిరిగి వచ్చాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లు అన్ని చిందరవందరగా పడి ఉన్నాయి. దాచి పెట్టిన బంగారు ఆభరణాలు, వెండి, నగదు కనిపించక పోవడంతో వెంటనే త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉదయం వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రపంచ జనాభా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను జేసీ నారపురెడ్డి మౌర్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్యతో కలిసి ఆవిష్కరించారు.అనంతరం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన కుటుంబాలను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి నగదు పంపిణీ చేశారు. దేవనకొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన హిమబిందు-నాగరాజు దంపతులు, కోసిగి మండల కేంద్రానికి చెందిన డి.మంగమ్మ-డి.తిమ్మారెడ్డి, బేతంచెర్లకు చెందిన షేక్ షాబీ-హుసేనప్ప దంపతులు లక్కీ డిప్‌లో నగదు ప్రోత్సాహకానికి ఎంపికయ్యారు.

చిన్నకుటుంబానికి జైకొడదాం!

- పెరిగే జనాభాకు అడ్డుకట్ట వేద్దాం
- జనాభాతో కుటుంబ, దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందులు
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- కు.ని పాటించిన వారికి ప్రోత్సాహక నగదు
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా ఇంటికి ఇద్దరు, ముగ్గురు చుట్టాలు వస్తే ఒకటి, రెండు రోజులు ఆదరిస్తారు. వారే రోజుల తరబడి ఉంటే ఎప్పుడు వెళ్తారా అని ఎదురుచూస్తూ ఉంటారు. ఎందుకంటే వారు ఉండే ప్రతి రోజూ ఆ కుటుంబానికి ఆర్థికభారం పెరుగుతుంది. పేద, మధ్యతరగతి కుటుంబాలైతే ఈ భారాన్ని మోయలేవు. అలాగే పెరుగుతున్న జనాభాను మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలూ తట్టుకోలేవు. కుటుంబం లాగానే ఆయా దేశాల అభివృద్ధికి జనాభా పెరుగుదల పెద్ద అవరోధమవుతుంది. అందుకే పరిమిత కుటుంబాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పాలకులు చెబుతుంటారు. ఈ నెల 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 24,26,722 మంది ఉన్నారు. ప్రతి పదేళ్లకు ఒకసారి 3 నుంచి 4 లక్షల జనాభా పెరుగుతుంది. ఈ కారణంగా భూమి, ధాన్యం, ధనం లభించడం ఇబ్బందిగా మారుతుంది. అధిక జనాభా కారణంగా ప్రతి ఇంట్లో సమస్యలే. ఈ కారణంగా చాలా మంది ఇప్పటికే కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నారు. పాతికేళ్ల క్రితం జంటకు ముగ్గురు, నలుగురు సంతానం ఉండేవారు. ప్రస్తుతం ఒకరు లేదా ఇద్దరు చాలనుకుంటున్నారు. అయితే, రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో జనాభా పెరగాలని గత తెలుగుదేశం ప్రభుత్వం ఆదేశాలు సైతం జారీ చేసి కుటుంబ నియంత్రణ పద్ధతులను నీరుగార్చింది. జరగబోయే ప్రమాదాన్ని పసిగట్టిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 2019 కుటుంబ నియంత్రణ పద్ధతులను గాడిలో పెట్టింది. అయితే, వరుసగా రెండేళ్లు కోవిడ్ ఉధృతి కారణంగా కుంటుపడిన ఈ కార్యక్రమం గతేడాది నుంచి మళ్లీ ఉధృతమైంది. కుటుంబ నియంత్రణ పాటించిన వారికి, ప్రోత్సహించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతులు ప్రదానం చేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీపీ యూనిట్, గడియారం ఆసుపత్రి, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలోని పీపీ యూనిట్, ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, కోడుమూరు, ఓర్వకల్లు, పత్తికొండ, వెల్దుర్తి, ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఇందులో కర్నూలులో మాత్రమే డీపీఎల్(బటన్‌హోల్) ఆపరేషన్లు చేస్తున్నారు.

కుటుంబ నియంత్రణకు ప్రోత్సాహకాలు

కర్నూలు బోధనాసుపత్రి, నంద్యాల జిల్లా ఆసుపత్రుల్లో ప్రసవానంతరం వెంటనే ఆంత్రా ఇంజెక్షన్లు బాలింతలకు ఇస్తున్నారు. ఇది కూడా బాలింత, ఆమె కుటుంబసభ్యుల అనుమతి తీసుకుని ఇస్తున్నారు. దీనివల్ల మళ్లీ మూడేళ్ల వరకు మహిళ గర్భం దాల్చకుండా ఉంటుంది. దీంతో పాటు నిరోధ్‌లు, గర్భనిరోధక మాత్రలను ఆయా ఆసుపత్రుల్లో ప్రత్యేక బాక్స్‌ల్లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన పీపీ ఐయూసీడీ చేయించుకున్న వారిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి రూ.10వేలు ప్రోత్సాహక నగదు ఇస్తున్నారు. అలాగే పీపీ యూనిట్‌లో ఆంత్రా ఇంజెక్షన్లను ప్రోత్సహించే కౌన్సిలర్లకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి రూ.5 వేలు, పీపీ ఐయూసీడీలను ప్రోత్సహించే ఏఎన్‌ఎం/ఆశలను ఎంపిక చేసి వారికీ రూ.5వేలు, పీపీఐయూసీలను ప్రమోట్ చేసిన వైద్యులకు రూ.10వేల చొప్పున ఇవ్వనున్నారు.

నాలుగేళ్లలో కు.ని వివరాలు

సంవత్సరం	లక్ష్యం	లక్ష్య సాధన	(శాతం)
2018-19	25,000	17,569	(70.28)
2019-20	25,000	16,556	(66.22)
2020-21	25,000	7,728	(30.91)
2021-22 (మార్చి)	14,058	7,575	(53.88)
2022-23	13,563	7,680	(56.62)

కుటుంబ నియంత్రణపై విస్తృతంగా కార్యక్రమాలు



జిల్లాలో ఇక కుటుంబ నియంత్రణపై కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తాము. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. కుటుంబ నియంత్రణ పాటిస్తే కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాము. ఎప్పటిలాగే కుటుంబ నియంత్రణ పద్ధతులు, ఆపరేషన్లు చేయించుకున్న వారికి ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తున్నాము.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

వెంట వెంటనే ప్రసవాలతో అనారోగ్యం



అధిక జనాభా పర్యావరణం, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల తల్లికి, జన్మించిన బిడ్డకు, మళ్లీ జన్మించబోయే బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. వెంట వెంటనే బిడ్డను ప్రసవించడం వల్ల గర్భం బలహీనమై తల్లికి భవిష్యత్‌లో తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. వారికి జన్మించే బిడ్డలు సైతం పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు.

–డాక్టర్ టి. జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

19న జిల్లా రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో జిల్లా రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపికలు ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ప్రతినిధి మల్లికార్జునుడు సోమవారం తెలిపారు. 10, 12, 14, 17, 19 సంవత్సరాల్లోపు విభాగాల్లో బాల బాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫొటో, ఆధార్‌తోపాటు రూ.30 ప్రవేశరుసుం చెల్లించి హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9949257657ను సంప్రదించాలన్నారు.

మహిళ రక్త దానం



రక్తం అందిస్తున్న మహిళ

డోన్ టౌన్: ఆపద సమయంలో ఓ మహిళ రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచింది. ఆత్మకూరుకు చెందిన ధనలక్ష్మి అనే మహిళకు గర్భస్రావం జరిగి అరుదైన రక్తం బాంబే బ్లెడ్ గ్రూపు అవసరమైంది. అత్యవసరం కావడంతో కుటుంబీకులు, మిత్రులు ప్రయత్నించినా లభించలేదు. చివరకు డోన్ పట్టణానికి చెందిన ఓ ముస్లిం మహిళ విషయం తెలుసుకుని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటింది. ఈ మేరకు ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జయదేవ్ దత్త, ధనలక్ష్మి కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఆ భూమి కౌలుకు ఇవ్వలేదు'

- మా కుటుంబీకులపై ఆరోపణలు అవాస్తవం
- నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల మండలం వెంకటేశ్వరపురం గ్రామ శివారులో 15 ఏళ్లక్రితం 5.75 ఎకరాల భూమి కొనుగోలు చేశామని, ఆ భూమిని ఎవరికీ కౌలుకు ఇవ్వలేదని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి పేర్కొన్నారు. తన కుటుంబీకులపై నిరాధారాలతో పత్రికల్లో కథనాలు రావడం బాధాకరమని, ఆరోపణలు అవాస్తవమన్నారు. ఎంపీ వివరాల మేరకు.. చాలా ఏళ్లుగా భూమి ఖాళీగా ఉందనే విషయాన్ని ఎంపీ సోదరుడు రాధాకృష్ణారెడ్డి వద్ద కారు డ్రైవరుగా పనిచేస్తున్న మునయ్య తెలుసుకున్నాడు. రెండేళ్ల క్రితం తన సమీప బంధువు అయిన వెంకటేశ్వరాపురం గ్రామానికి చెందిన శేషన్నకు ఏడాదికి రూ.2 లక్షల చొప్పున కౌలుకు ఇచ్చాడు. ఇటీవల ఎంపీ మేనల్లుడు రవికుమార్‌రెడ్డి విషయం తెలుసుకుని ఎంపీ దృష్టికి తీసుకెళ్లాడు. ఈ ఏడాది పంటలు వేయవద్దని సూచించినప్పటికీ మునయ్య తన బంధువులతో జొన్న పంట వేయించాడు. ఈ క్రమంలో రవికుమార్ రెడ్డి ఆదివారం కంది పంట వేసేందుకు ట్రాక్టర్ తీసుకెళ్లగా అప్పటికే జొన్న సాగు చేయడంతో గమనించి ట్రాక్టర్‌తో దున్నించాడు. దీంతో మునయ్య, శేషన్న ఆయన భార్య అంకాలమ్మ 30 మందితో కలిసి పొలం దగ్గర ఉన్న రవికుమార్ రెడ్డిపై దాడి చేసేందుకు వెళ్లగా వారి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది తెలుసుకున్న శేషన్న, ఆయన భార్య అంకాలమ్మలు ఆసుపత్రికి వెళ్లి తమపై ఎంపీ అనుచరులు దాడి చేశారని చెబుతూ ఈనాడు పత్రికలో అవాస్తవాలు రాయించారని ఎంపీ చెబుతున్నారు. ఒంటరిగా వెళ్లిన రవికుమార్ అంత మంది చూస్తుండగా వారిపై దాడి చేసి కులం పేరుతో దూషించాడని అవాస్తవాలు ప్రచారం చేయడం బాధ కలిగించిందన్నారు.

కేజీబీవీల్లో టీచర్ల నియామకాలకు కౌన్సెలింగ్

- 226 పోస్టులకు నియామక పత్రాలు



నియమాక పత్రాలు అందజేస్తున్న జేసీ మౌర్య

కర్నూలు సిటీ: కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఎంపికైన వారికి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి జేసీ నారపురెడ్డి మౌర్య నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో 233 పోస్టులకు భర్తీ చేసేందుకు గత నెల మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేయగా సుమారు 7 వేల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మెరిట్ ప్రాతిపదికన తుది జాబితాను తయారు చేసి స్కిల్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. సోమవారం వారికి మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన ఖాళీలను ప్రదర్శించి ఎంపిక చేసుకున్న ఖాళీల్లో నియమాక పత్రాలు అందజేశారు. 233 పోస్టుల్లో 226 భర్తీ చేసినట్లు సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్ తెలిపారు.

బాలికకు అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): నెల్లూరు జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలికకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు. సోమవారం పీడియాట్రిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శివకుమార్, ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. 'నెల్లూరు జిల్లా పొట్టిపల్లి గ్రామానికి చెందిన మాధవరావు, మనోజ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. వీరికి నలుగురు సంతానం. మొదటి కుమార్తె నందిని గత నెల 23వ తేదీన కడుపునొప్పితో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో చేరింది. ఆమెకు సీటీస్కాన్ పరీక్ష చేయించగా క్లోమగ్రంథి నుంచి వచ్చిన కణితిగా నిర్ధారణ అయ్యింది. గత నెల 30వ తేదీన ఆపరేషన్ చేసి కణితిని పూర్తిగా తొలగించాము. ఈ కణితి 10గీ8 సెం.మీ పరిమాణంలో ఉంది. ఇది చాలా అరుదైనది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఇలాంటి కేసు పిల్లల్లో రిపోర్ట్ కాలేదని నిర్ధారణ అయ్యింది. వైద్యపరిభాషలో ఇలాంటి కణితిని సాలిడ్ సూడో పాపిలరి నియోప్లాసమ్ ఆఫ్ పాంక్రియాస్ అంటారు. బాలిక కోలుకోవడంతో సోమవారం డిశ్చార్జ్ చేశా'మని వెల్లడించారు. ఆపరేషన్‌లో తమ ఇద్దరితో పాటు డాక్టర్ గ్రేస్, డాక్టర్ నరేష్, డాక్టర్ మధు, డాక్టర్ శ్రీకాంత్, మత్తుమందు వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ పాల్గొన్నట్లు తెలిపారు.

ముగ్గురు వేటగాళ్ల అరెస్టు

- మరో నలుగురు పరారీ
- నాటు తుపాకీ స్వాధీనం



వేటగాళ్ల అరెస్ట్ చూపుతున్న అటవీ అధికారులు

రుద్రవరం: చుక్కల దుప్పిని వేటాడి చంపిన కేసులో ముగ్గురు వేటగాళ్లను అరెస్ట్ చేసినట్లు రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు రిజర్వాయరు వద్ద జింకల వేట సాగుతున్నట్లు ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డికి సమాచారం అందింది. వెంటనే ఆయన సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారు. దాడిలో మండల పరిధిలోని హరినగరానికి చెందిన వెంకటయ్య, పవన్ కళ్యాణ్, శేఖర్ పట్టుబడగా సూరి, శీను మరో ఇద్దరు నిందితులు పారిపోయారు. పట్టుబడిన వారి నుంచి ఒక నాటు తుపాకీ, మృతి చెందిన చుక్కల దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోనే మృతి చెందిన దుప్పికి ఎర్రగుడిదిన్నె పశువైద్యాధికారి మనో రంజన్ ప్రతాప్‌తో పోస్టుమార్టం చేయించి కళేబరాన్ని అక్కడే ఖననం చేశారు. పట్టుబడిన నిందితులపై వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు రేంజర్ తెలిపారు. పరారీలో ఉన్న ఇరువురు నిందితులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

అంకితభావంతో పని చేయండి



మాట్లాడుతున్న దేవస్థానం ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థాన అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఈఓ లవన్న సూచించారు. సోమవారం పరిపాలనా సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అన్ని విభాగాల అధిపతులు వారి పరిధిలోని విధుల పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఆయా విభాగాల వారీగా సమీక్షను నిర్వహించారు. అధునాతన పద్ధతిలో రికార్డు రూమ్ నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థాన గదులు, కాటేజీలు పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. క్షేత్రానికి విచ్చేసే ప్రతి భక్తుడును కూడా అతిథిగా భావించాలని అధికారులకు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దోర్నాల సమీపంలోని దేవస్థానం భూమిలో పచ్చగడ్డి పెంచేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఘంటామఠం ప్రాంగణంలోని కొమారిదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి, పాండవుల గుహ వద్ద కాల భైరవ ఆలయ నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవస్థానం సహాయ కమిషనర్ హెచ్‌జి వెంకటేష్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, ఏఈఓలు ఫణిధర ప్రసాద్,హరిదాసు, పర్యవేక్షకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెరలో బంగారు ఆభరణాలు అపహరణ

మద్దికెర: స్థానిక సాయినగర్‌లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బళ్లారి మల్లికార్జున, బళ్లారి పవన్ ఇళ్లల్లో దొంగలు పడి 5 తులాల బంగారు, రూ.20 వేలు నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు ఇంటికి తాళాలు వేసి అదే గ్రామంలో జరిగే కార్యక్రమానికి వెళ్లారు. ఉదయం వచ్చి చూడగా ఇళ్ల తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లగా బీరువా, పెట్టెల తాళాలు పగులగొట్టి బట్టలు చిందరవందరగా పండి ఉండటంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- నకిలీ నోట్ల పేరుతో చీటింగ్ చేసినట్లు అభియోగం
- కొనసాగుతున్న దర్యాప్తు



కానిస్టేబుల్ విజయకుమార్

కర్నూలు: ఆలూరు సర్కిల్ పరిధిలోని ఆస్పరి పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విజయకుమార్ (పీసీ 2910)పై సస్పెన్షన్ వేటు పడింది. నకిలీ నోట్ల పేరుతో చీటింగ్ చేస్తున్న ముఠాతో చేతులు కలిపి భారీగా డబ్బులు వసూలు చేశాడన్న ఫిర్యాదు నేపథ్యంలో పోలీస్ 'బాస్' విచారణ జరిపించారు. కై రుప్పల, ములుగుందం, కారుమంచి, ఆస్పరి, ఆలూరు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, ఎల్ఐసీ ఏజెంట్లు, ఆయా ప్రాంతాల్లోని ప్రముఖుల నుంచి దాదాపు రూ.30 లక్షల దాకా డబ్బులు దండుకున్నట్లు బాధితుల్లో ఒకరైన కారుమంచి గ్రామానికి చెందిన ఆంజనయ్యతో పాటు మరికొంతమంది స్వయంగా ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కానిస్టేబుల్‌ను విచారణలో భాగంగా మొదట వీఆర్‌కు రప్పించి ఆ తర్వాత శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

బళ్లారి ముఠాతో చేతులు కలిపి...

లక్ష అసలు నోట్లకు మూడు లక్షలు నకిలీ నోట్లు (ఫేక్ కరెన్సీ) ఇస్తామని నమ్మబలికి బళ్లారికి చెందిన ఓ అజ్ఞాత వ్యక్తితో కానిస్టేబుల్ విజయకుమార్ చేతులు కలిపి భారీగా వసూలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వెంగలాయదొడ్డి గ్రామానికి చెందిన ఎరువుల వ్యాపారి ఒకరు బళ్లారిలో స్థిరపడ్డారు. దొంగనోట్ల పేరుతో చీటింగ్‌కు పాల్పడుతున్న ఈ ముఠా వెనుక అతని హస్తం ప్రధానంగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

అరెస్టుకు రంగం సిద్ధం...

కానిస్టేబుల్ విజయకుమార్‌పై ఆస్పరి పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి పర్యవేక్షణలో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నారు. పనిచేస్తున్న స్టేషన్‌లోనే కానిస్టేబుల్‌పై చీటింగ్ కేసు నమోదు కావడం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు 50 మందికి పైగా కానిస్టేబుల్ చేతిలో మోసపోయినట్లు సమాచారం. దీంతో ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపేందుకు రంగం సిద్ధమైంది. కాగా మోసం చేసిన వారిలో విజయకుమార్‌తో పాటు ఇద్దరు తెలియని వ్యక్తులు కూడా ఉన్నారని, విచారణ కొనసాగుతుందని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన ప్రకటనలు చూసి నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో మెరుగవ్వాలి

కర్నూలు(సెంట్రల్): స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో దేశంలో కర్నూలు స్థానం గతేడాది కంటే మెరుగుపడాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులపై అభిప్రాయ సేకరణకు సంబంధించి నిర్వహిస్తున్న సిటిజన్ ఫీడ్ బ్యాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను సోమవారం సునయన ఆడిటోరియంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి సిటిజన్ ఫీడ్ బ్యాక్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు స్వచ్ఛతపై తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. గతేడాది దేశంలో కర్నూలు మునిసిపాలిటీ 55వ స్థానంలో, రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందేనన్నారు. ఈ ఏడాది ఆ ర్యాంకులు మరింత మెరుగు పడాలన్నారు.

క్లుప్తంగా

మహిళల చేతుల్లో బ్రహ్మాస్త్రం 'దిశ'



ఆళ్లగడ్డ సమీపంలో కూలీలకు దిశపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆళ్లగడ్డ: మహిళలకు దిశ యాప్ బ్రహ్మాస్త్రమని పోలీసులు పేర్కొన్నారు. సోమవారం ఆళ్లగడ్డ శక్తి టీమ్ సభ్యులు సుబ్బలక్ష్మీ, నాగశేఖర్ పట్టణ సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లి మహిళా కూలీలకు దిశ యాప్, బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో భైరవాష్టమి పూజలు

ఆళ్లగడ్డ: చిన్నకందుకూ రు సమీపంలో వెలసిన భైరవస్వామి ఆలయంలో భైరవ అష్టమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన అష్టమి ని పురస్కరించుకుని సోమవారం కాలభైరవ స్వామిని మేలుకొలిపి బహుళ అష్టమి పూజలు జరిపించారు. అనంతరం అర్చనలు, అషేకాలు చేపట్టి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ కాళికామాత ఆలయంలో భక్తులు భజనలు చేసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాలను ముగించారు.

వేలం వాయిదా

ఆళ్లగడ్డ: రామతీర్థ పుట్లాలమ్మ క్షేత్రంలో సోమవారం నిర్వహించిన టెంకాయల వేలం వాయిదా పడిందని ఈఓ సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. క్షేత్రంలో 2023 -24 సంవత్సరానికి సంబంధించి ఏడాది పొడవునా టెంకాయలు విక్రయించుకునే హక్కుకు ఆలయ ఆవరణలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో వేలం పాటలు నిర్వహించారు. అయితే కాంట్రాక్టర్లు దేవస్థానం అంచనా మేరకు పాట పాడక పోవడంతో వేలం వాయిదా వేశారు. మళ్లీ వేలం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని ఈఓ తెలిపారు.

పాఠశాలకు ఫ్యాన్ విరాళం

రుద్రవరం: పెద్దకంబలూరు పంచాయతీ మజరా గ్రామమైన పందిర్లపల్లె ప్రభుత్వ పాఠశాలకు సీపీఐ నాయకుడు బాలనరసింహుడు సోమవారం సీలింగ్ ఫ్యాన్ విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పై కప్పు పెచ్చులూడి పడుతోందని, విద్యార్థులు ప్రమాదాల బారిన పడక ముందే భవనం దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయుడిని కోరారు.

నేడు 'జగనన్న సురక్ష'

గోస్పాడు: మండలంలోని కానాలపల్లె గ్రామంలో నేడు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రజలకు కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ, సీసీఆర్సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్ తదితర 11 రకాల ధ్రువ పత్రాలు అందజేస్తామని చెప్పారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల సచివాలయ పరిధిలో మంగళవారం జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం ఎంపీడీఓ సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న 11 ఉచిత ధ్రువపత్రాల్లో ఏ క్లస్టర్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వాటిపై ఆరా తీశారు. ధ్రువపత్రాలు మంజూరైన వారికి అందజేస్తామన్నారు. మండలస్థాయి అధికారులంతా పూర్తి సమచారంతో హాజరు కావాలని కోరారు.

దుస్తులు, పుస్తకాలు అందజేత

ఉయ్యాలవాడ: మండలంలోని హరివారం ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లి,తండ్రి లేని విద్యార్థులకు అనన్య సేవా సంస్థ తరఫున వసుమతి, శాంతి, గంగ హెచ్‌ఎం రామమోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం దుస్తులు, వాటర్ బాటిళ్లు, పుస్తకాలు అందజేశారు. అలాగే విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.3వేలు అందజేశారని హెచ్‌ఎం తెలిపారు.

అన్నదానం

గోస్పాడు: యాళ్లూరు సీహెచ్‌సీ వద్ద వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ సహకారంతో సోమవారం రోగులకు అన్నదానం చేశారు.ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చే పేషెంట్లు, బాలింతలకు మధ్యాహ్న సమయంలో భోజన ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

రుద్రవరం: మండలూరు గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం చూపారు.సర్పంచు నిర్మలమ్మ మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా మోటార్ పని చేయక నీటి సమస్య తలెత్తింది. ఏళ్ల క్రితం అమర్చిన మో టార్ కావడంతో మరమ్మతులకు గురైంది. వెంటనే కొత్త మోటార్, పైపులు కొనుగోలు చేసి అమర్చి సోమవారం తాగునీటిని సరఫరా చేయించారు.

జయప్రదం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాలంగిరాముడు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రాయచోటి పట్టణంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

కేసు నమోదు

ఆళ్లగడ్డ: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు మేరకు భర్త బ్రహ్మంతో పాటు మరో ఐదుగురిపై గృహ హింస కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు సోమవారం తెలిపారు. అహోబిలం గ్రామానికి చెందిన కొండయ్య కూతురు గీతాంజలికి కడపకు చెందిన బ్రహ్మంతో వివాహం జరిపించారు. ఇటీవల అదనపు కట్నం కావాలని వేదించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

ప్రైవేట్‌కు దీటుగా..

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జోరుగా అడ్మిషన్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకు భరోసా
- సకల సౌకర్యాలు, హాస్టల్ వసతి
- 12 వరకు దరఖాస్తులకు అవకాశం
- కళాశాలల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు	- 9
ప్రైవేటు కళాశాలలు	- 30
అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ఆఖరు తేదీ జూలై 12	
వెబ్ ఆప్షన్ల నమోదు జూలై 15 నుంచి 19 వరకు	
సీట్ల కేటాయింపులు జూలై 24	
కళాశాలలో చేరాల్సిన తేదీ జూలై 24	

నంద్యాల డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య..

ఫస్టియర్	- 131
సెకండియర్	- 294
ఫైనలియర్	- 315
మొత్తం	- 740

ప్రస్తుతం వంద మంది అడ్మిషన్ పొందారు. ఇంకా కొనసాగుతున్నాయి.



అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల



ఆధునికీకరించిన లైబ్రరీ



కంప్యూటర్ సిస్టమ్ టీచింగ్, లెర్నింగ్ ఎయిడ్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకల వసతులు సమకూర్చడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేసి విద్యార్థులను ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరానికి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కూడా అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 30 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో 50వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీలో చేరాలనుకునే వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు ఉంది. ఇందుకు అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు ఉన్నాయి. నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ గ్రేడ్ పొందింది. ఈ కళాశాలకు ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చదివిన ఎంతో మంది వివిధ ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అలాగే..డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూర విద్యను అందిస్తున్నారు. న్యాక్ ఏ గ్రేడ్ ఉండటంతో (యూజీసీ) విశ్వవిద్యాలయాల నిధుల సంఘం నిధులను కేటాయిస్తుంది. కళాశాలలో అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. విశాలమైన క్రీడామైదానం సమీపంలో బాలుర, బాలికల కోసం ప్రభుత్వ ఎస్సీ, బీసీ, వసతి గృహాలు ఉన్నాయి. కళాశాలలో డిజిటల్ క్లాస్ రూములు, గ్రీన్‌బోర్డులు, ప్రొజెక్టర్లు, కంప్యూటర్ సిస్టమ్ టీచింగ్ లెర్నింగ్ ఎయిడ్‌తో బోధన సాగుతుంది. నిష్ణాతులైన అధ్యాపకులతో విలువలతో కూడిన బోధన సాగిస్తున్నారు. ఆధునిక ప్రయోగ శాలలు, గ్రంథాలయం, రీడింగ్ రూం, కంప్యూటర్ రూం, జవహర్ విజ్ఞాన కేంద్రం, కళాశాలలోనే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం ఉన్నాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణమైన కోర్సుల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

అన్ని సౌకర్యాలున్నాయి



ఉన్నత విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. డిగ్రీ పూర్తి చేసే విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. విద్యార్థులకు ఉపయోగకరంగా అన్ని సౌకర్యాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నాయి. ప్రైవేటుకు దీటుగా అన్ని హంగులతో కళాశాలలను నిర్వహిస్తున్నాం. అడ్మిషన్ల ప్రక్రియలో విద్యార్థులు ఈ కళాశాలను ఎంపిక చేసుకొని తమ బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి. **– డాక్టర్ శశికళ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నంద్యాల**

ప్రవేశాలకు 14 వరకు గడువు

శిరివెళ్ల: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరుటకు ఈ నెల 14వ తేదీ చివరి గడువని యర్రగుంట్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు వెంటనే దరఖాస్తులు పూర్తి చేసి కళాశాలలో అందచేయాలని సూచించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ తదితరులు కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికులకు మెరుగైన సేవలు, వారి సౌకర్యార్థం,సమస్యలు తెలుసుకోవడానికి మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధరరావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని, సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు ఇవ్వదలచినవారు వారు సెల్ 9959225800 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

మోటార్ సైకిల్ చోరీ

శిరివెళ్ల: వేనికిదినిదిన్నెకు చెందిన చెన్నయ్య మోటార్ సైకిల్ చోరీకి గురైందని ఎస్ఐ సురేష్ సోమవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన యర్రగుంట్లలోని డీలర్ పుల్లయ్య దుకాణం వద్ద పార్కింగ్ చేసి వెళ్లగా పని ముగించుకొని వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మందుబాబులకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఇద్దరికి సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించారని పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు.. శ్రీకాంత్, అమీర్ స్థానిక శ్రీనివాస సెంటర్ వద్ద మద్యం మత్తులో దారిలో వెళ్లు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా రెండవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి ఐదు రోజులు జైలు శిక్ష విధించారని చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం ఎస్సీ కాలనీకి చెందిన నాగన్న అనే వృద్ధుడు సోమవారం ఇంటి ముందు కళ్లాపు చెల్లే పొడిని నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించాడు.కొద్ది సేపటికి వాంతులు చేసుకుంటుండటంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యకు యత్నించాడని కాలనీ వాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

బొమ్మలసత్రం: నంద్యాల మండలం చాబోలు టోల్‌ప్లాజా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి కిషోర్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కిషోర్ స్థానిక ఆర్‌జీఎం కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కళాశాలకు తన బైక్‌పై వేగంగా వెళ్తూ యూటర్న్ తీసుకుంటున్న స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టాడు. క్షతగాత్రుడిని స్థానికులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెడ్డి సంఘం యువజన అధ్యక్షుడి నియామకం



వెంకటప్రదీప్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా పుల్లగూర వెంకటప్రదీప్‌రెడ్డిని నియమిస్తూ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా నియమించిన సురేంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆళ్లగడ్డ : అహోబిలంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు సోమవారం తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి దాడులు నిర్వహించగా శ్రీనివాసరెడ్డితో పాటు 10 మందిని అదుపులోకి తీసుకుని రూ.15,600 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకోవాలి

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలపై సత్వరమే ఆయా శాఖాధికారులు స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బోడెమ్మనూరు, రూపనగుడి, కాకరవాడ గ్రామాలకు చెందిన రైతులు పెద్దవీరారెడ్డి, చిన్నగురప్ప, దాసరి రాంపుల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు తమ పొలాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సంవత్సరం నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఏఓ రాజేంద్రకుమార్, ఏపీఓ రవిప్రకాష్, ట్రాన్స్‌కో ఏఈ గురప్ప పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పెండింగ్ రిక్వెస్ట్‌లను పూర్తి చేయండి

- జగనన్నకు చెబుదాం .. స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి – డీఆర్‌ఓ పుల్లయ్య



మహిళ సమస్యను వింటున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల: జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల జారీకి పెండింగ్‌లో ఉన్న రిక్వెస్ట్‌లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. డీఆర్‌ఓ, ఇతర జిల్లా ధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షకు సంబంధించి నంద్యాల, శ్రీశైలం, బనగానపల్లె, దొర్నిపాడు డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు తదితర మండలాల్లో అధికంగా పెండింగ్ ఉన్న సర్వీస్ రిక్వెస్ట్‌లను వెంటనే క్లియర్ చేసి నివేదికలను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరై ఇంకా ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆత్మకూరు, నందికొట్కూరు, బేతంచెర్ల మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమం అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 11 నుంచి 24 వరకు నిర్వహించే కార్యక్రమాలపై కరపత్రాలను డీఎంఅండ్‌హెచ్‌ఓతో కలిసి ఆవిష్కరించారు. స్పందనలో మొత్తం 185 అర్జీలు వచ్చినట్లు చెప్పారు.జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నా రు.

స్పందనలో వచ్చిన వినతుల్లో కొన్ని..

- ప్యాపిలి మండలం ఊటకొండ గ్రామానికి చెందిన ఆర్.తిరుపాలు తనకు సర్వే నంబర్ 1188లో 175 సెంట్ల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమిని ఆన్‌లైన్ చేసి పాస్ బుక్ జారీ చేయాలని వీఆర్‌ఓకు ఎన్ని సార్లు కోరినా స్పందించడం లేదని, చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓకు అర్జీ సమర్పించారు.
- నంద్యాల పట్టణానికి చెందిన వెంకటలక్ష్మమ్మ తనకు 48 ఎకరాల భూమి ఉందని, తమ తండ్రికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూమార్తెలమని, మా నాన్న పేరు మీద 8 ఎకరాలు ఉండగా, మిగిలిన భూమి కొడుకులు పంచుకున్నారని, మా నాన్న పేరు మీద ఉన్న భూమిలో నాకు 2 ఎకరాలు, మా అక్కకు 2 ఎకరాలు ఇప్పించాలని కోరుతూ డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.
- చాబోలు గ్రామానికి ఎం.మహమ్మద్ వాసీంకు పోలియో వ్యాధి కారణంగా ఎడమ కన్ను చూపు పూర్తిగా కోల్పోయిందని, సదరం క్యాంపులో పర్సంటేజీ సరిగా ఇవ్వడం లేదని, ఇంతకు ముందు ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని అర్జీలో కోరాడు.

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం



మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం చాగలమర్రిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా 5వ సచివాలయ పరిధిలోని 17,18 వార్డులకు చెందిన నాయకులు వలిసాగారి షరీఫ్ గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు చిరుధాన్యాల్లో రాగులు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న పంటలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, రాష్ట్రంలో రైతులు పండించే కొర్ర పంటకు కూడా మద్దతు ధర ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారని చెప్పారు. ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి, మహానంది మండలాల్లో పసుపు పంట విస్తారంగా పండింది. దీంతో రైతులు నష్టపోకుండా ఒక్కో రైతు నుంచి 30 క్వింటాళ్ల చొప్పున క్వింటాకు రూ.6,850 మద్దతు ధరతో సుమారు 879.82 మెట్రిక్ టన్నులు ఇప్పటికే కొనుగోలు చేసిందని చెప్పారు. కొనుగోలు చేసిన మొత్తాన్ని 10 రోజులలోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని వివరించారు. పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి ఎంపీపీ ఎం.వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, సింగల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, ఉపసర్పంచ్ మహమ్మద్ సోహెల్, కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీలు ఫయాజ్, లక్ష్మీరెడ్డి, నాయబ్‌రసూల్, చక్రం షబ్బీర్, ఖాజా,ముల్లా ఖాదర్‌బాషా, మల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామగురివిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

ఉయ్యాలవాడ : గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలని గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్విని, శివలింగమ్మ, విజయదుర్గ సూచించారు. సోమవారం మండలంలోని పెద్దయమ్మనూరు, మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన పథకం కింద 50 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వీరిలో 8 మంది హైరిస్క్‌లో వున్నట్లు గుర్తించి పలు సూచనలు చేశామని వైద్యాధికారి రాబర్ట్ కెనడీ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సేబారాణి, నిర్మల, తోటమద్దులు, భాస్కర్, గౌస్, లక్ష్మణ్, బాలవెంకట్ పాల్గొన్నారు.

ఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలి

గోస్పాడు: విద్యార్థులకు రక్షణ కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక కేజీబీవీ ఎస్‌ఓ సునీతపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. పాఠశాల గేటు వద్ద సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 15రోజుల క్రితం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న లక్ష్మీప్రసన్నకు విషపురుగు కాటువేసినా నిర్లక్ష్యం వహించడంతో పాటు నామమాత్రంగా చికిత్స చేయించి ఇంటికి పంపారన్నారు. అయితే విద్యార్థినికి తీవ్రంగా ఇన్‌ఫెక్షన్ కావడంతో తల్లిదండ్రులు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారని చెప్పారు.

ఇంటి వద్ద కాన్పులు ప్రమాదకరం

దొర్నిపాడు: ఇంటి వద్ద కాన్పులు ప్రమాదకరమని, సొంత ప్రసవాలు చేసుకోరాదని దీంతో తల్లీబిడ్డలకు క్షేమం కాదని డాక్టర్ నాగేంద్ర సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ముబీనాకు సురక్షితంగా కాన్పు చేశారు. అలాగే.. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజనలో భాగంగా సోమవారం పలువురు గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి



నంద్యాలోని గిరిన్నాథ్‌సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



దొర్నిపాడులో కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



చాగలమర్రిలో చేపట్టిన నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

నంద్యాల(అర్బన్): వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని జేసీఎస్ టౌన్ కన్వీనర్ సన్నల సాయిరాం రెడ్డి డిమాండ్ చేశారు. 15వ వార్డు గిరిన్నాథ్ సెంటర్‌లో సోమవారం వలంటీర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఆళ్లగడ్డ: వలంటీర్ల పట్ల పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సరికాదని వలంటీర్లు మండిపడ్డారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఉయ్యాలవాడ : పవన్ కళ్యాణ్ ఆదివారం ఏలూరులో జరిగిన నిర్వహించిన సభలో వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని మండల వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పార్టీ నాయకులు, వలంటీర్లు కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, హరివరం ఎంపీటీసీ పెద్ద పేరయ్య, సర్పంచ్ నడిపెన్న, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, ఆలయాల మాజీ ధర్మకర్త ఖాతా దస్తగిరిరెడ్డి, పల్లె శివశంకర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండలంలోని వలంటీర్లు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వలంటీర్లుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసనలో పాల్గొన్నారు.వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, వలంటీర్లు జాఫర్, కరీం,లింగన్న, లూర్దర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, ఉప సర్పంచు ఇంతియాజ్, తిమ్మరాయుడు పాల్గొన్నారు.

దొర్నిపాడు: వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ ప్రెసిడెంట్ భూమా చెంచిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, శివరామిరెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: వలంటీర్ల పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేసి వారి ఆగ్రహానికి గురికావొద్దని వలంటీర్లు పవన్ కళ్యాణ్‌కు హితవు పలికారు. తమన సంఘవిద్రోహ శక్తులతో పోల్చిన పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.వలంటీర్లు ఇలియాస్, సిద్దిఖ్, అన్వర్, ఆరీఫ్, సురేష్, రమణ, నరసింహుడు, కౌసర్, పుష్పలత, బీబీ తదితరులు పాల్గొన్నారు.

కరోనా సమయంలో వలంటీర్ల సేవలు గుర్తులేవా?



కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు గుర్తులేవా, వలంటీర్లు లేని రాష్ట్రాల్లో ఎలా గడిచిందో మర్చిపోయారా?. వలంటీర్ వ్యవస్థ వల్ల పేదలకు పథకాలు సరైన సమయంలో అందుతున్నాయని, ప్రభుత్వానికి మంచి పేరు రావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పవన్ మాటతీరు మార్చుకుంటే మంచిది.

–హసీనా,6వ వార్డు, నంద్యాల

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం



వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారింది. విపత్కర సమయంలో వలంటీర్లు ప్రతి గృహాన్ని సందర్శించి సేవలు అందించారు. పవన్ కళ్యాణ్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. వెంటనే క్షమాపణలు చెప్పాలి.

– రియాజ్,8వ వార్డు, నంద్యాల